

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ2.98.833లు.వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సాహంగా శిశు మహోత్సవం

జిల్లాలోని ఆర్.ఉదయగిరి బ్లాక్ రామగిరి ప్రభుత్వ ఎస్.ఎస్.డి. ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి సర్గిపుల్లో శిశు మహోత్సవం నిర్వహించారు.

- 8లో



మహిళలపై దాడులు అరికట్టాలి

మహిళలపై అత్యాచారాలు, దాడులు అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

సారా బట్టీలపై దాడులు



బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో సింగార్‌ఖడక్ కొండప్రాంతంలో నాటుసారా బట్టీలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. 1200 లీటర్ల ఊట ధ్వంసం చేయడంతో పాటు 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కాసీపూర్ సమితి పరిధిలో గల కొండప్రాంతాలైన సింగార్‌ఖడక్ ప్రాంతంలో ఈ దాడులు నిర్వహించారు.

ఎస్సీ కుల ధ్రువపత్రాలు మంజూరు చేయాలి



గజపతి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బుర్జంగి గ్రామస్తులు

పర్లాకిమిడి: హిందూ హరిజనులకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం రాయఘడ బ్లాక్ బుర్జంగి గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. 2001 2023 వరకూ బుర్జంగి క్రిస్టియన్ వీధిలో నివాసముంటున్న హరిజనులకు రాయగడ బ్లాక్ తహసీల్దార్లు నిరాటంకంగా సర్టిఫికెట్లు మంజూరు చేశారని, 2024లో కొత్తగా వచ్చిన రాయగడ తహశీల్దారు మాత్రం ధ్రువపత్రాలు మంజూరు చేయడం లేదని గ్రామానికి చెందిన బిభు పరిచ్చా తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదానికి గురైన అంబులెన్సు

భువనేశ్వర్: అంబులెన్సు అదుపు తప్పి డంపరుని ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జాజ్‌పూర్ జిల్లా 16వ నంబరు జాతీయ రహదారి చండీఖోల్ సమీపం నెవులాపూర్ రైల్వే ఓవరు బ్రిడ్జి ప్రాంతంలో గురువారం వేకువ జామున భువనేశ్వర్ హైటెక్ ఆస్పత్రిలో చికిత్స కోసం రోగిని తరలిస్తుండగా నెవులాపూర్ రైల్వే ఓవరు బ్రిడ్జి వద్ద డంపరును ఢీకొట్టింది. ఈ ఘటనలో అంబులెన్సులో రోగి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రోగి బంధువుల్లో ముగ్గురు గాయపడటంతో బొడొచాణ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో చేర్చి ప్రథమ చికిత్స చేయించారు. పోలీసులు మృతదేహాన్ని సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

78 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

జయపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సురేంద్రసాయి విజన్ మిషన్ ఆధ్వర్యంలో జయపురం సమితి హొరడపుట్‌లో నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా సంచార నేత్ర పరీక్ష విభాగం వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 78 మందికి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. రమణాగుడ ప్రాథమిక వైద్య కేంద్రం అధికారి డాక్టర్ స్వస్తిక్ మహంతి, మథల్‌పుట్ వైద్య కేంద్రం నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ విజయ ఆచార్యులు రోగులను పరీక్షించారు. కొంతమందికి శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఆస్పత్రి సూపర్‌వైజర్ శాంతిలత ప్రధాన్, సంజయ సాహు, అభిమన్యు జాని, పుష్పాంజలి బిసొయి, నళినీత తార, రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హై అలర్ట్!



కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలు

- నేడు బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు
- అప్రమత్తమైన పోలీసు బలగాలు
- ముమ్మరంగా కూంబింగ్
- మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో క్షుణ్ణంగా తనిఖీలు

మల్కన్‌గిరి:

మావోయిస్టులు బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసు బలగాలు అప్రమత్తమయ్యాయి. కూంబింగ్ ముమ్మరం చేశాయి. మల్కన్‌గిరి జిల్లా పోడియ సమితి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమ జిల్లాల్లో ఈ నెల 22 జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు నిరసనగా శుక్రవారం బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. బస్తార్ డివిజన్ మావో కమిటీ, సుకుమ జిల్లా పరిధిలో బంద్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశమున్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. బీఎస్‌ఎఫ్, డీవీఎఫ్ జవాన్లు సంయుక్తంగా కూంబింగ్ ముమ్మరం చేశారు. మల్కన్‌గిరి జిల్లాకు ఆనుకుని ఉన్న సుకుమా జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కలిమెల, పోడియా, మత్తిలి సమితులలోకి మావోయిస్టులు ప్రవేశించే అవకాశం ఉన్నందున అడుగడుగునా తనిఖీలు చేస్తున్నారు. మూడు సమితులతో పాటు ఆంధ్ర-ఒడిశా, ఛత్తీస్‌గఢ్-ఒడిశా, ఛత్తీస్‌గఢ్-తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సరిహద్దులను సీజ్ చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడ పడుతున్నారు. డ్రోన్ కెమెరాలతో ఏరియల్ సర్వే చేస్తున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ తాపాన్ నారాయణ్ రోతో తెలిపారు.



మల్కన్‌గిరి సరిహద్దుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు



పోడియ సమితి సరిహద్దులో డీవీఎఫ్ జవాన్ల కూంబింగ్

15 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం



మల్కన్‌గిరి: గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: గంజాయి సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తరచూ దాడులు చేసి ధ్వంసం చేస్తున్నారు. తాజాగా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి జోడాంభో పోలీసుస్టేషన్ పరిధిలోని పోస్సాపోధర్ గ్రామంలో 15 ఎకరాల్లో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్టు చిత్రకొండ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో గురువారం ఎక్సైజ్, స్థానిక పోలీసులు సయుక్తంగా దాడులు చేశారు. గంజాయి మొక్కలను కట్‌చేసి ధ్వంసం చేశారు. గంజాయి తోటను సాగు చేస్తున్న స్థలం ఎవరిదో వివరాలు ఇవ్వాలని చిత్రకొండ తహసీల్దార్ ప్రశాంత్ బాత్రను అధికారులు ఆదేశించారు. కాగా ధ్వంసం చేసిన 22,500 గంజాయి మొక్కల విలువ సుమారు రూ. రెండు కోట్లు ఉంటుందని ఐఐసీ అధికారి ముకుందో తెలిపారు

గంజాయి సాగు చట్టవిరుద్ధం

రాయగడ : గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం ఆ దిశగా దాడులు నిర్వహిస్తోంది. డ్రోన్ల సాయంతో గంజాయి సాగు చేసే ప్రాంతాలను గుర్తించి వాటని ధ్వంసం చేస్తోంది. గంజాయి వల్ల కలిగే అనర్థాలు, ఎదుర్కోవాల్సిన దుష్పరిణామాలకు సంబంధించి ప్రజల్లో చైతన్య కలిగిస్తోంది. ఈ క్రమంలో ఎస్పీ శ్వాతి ఎస్.కుమార్ జిల్లాలోని కెందుగుడ ఔట్ పోస్ట్ పరిధిలోని లిటికిపదర్, ఢెంబాగుడ, గులుగుండ, నువాగడ పంచాయతీల పీఆర్‌ఐ సభ్యులతో (గ్రామస్తులు) బుధవారం సాయంత్రం చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అధిక శాఖ ఈ పంచాయతీ పరిధిలోనే గంజాయి సాగు జరుగుతోందన్నారు. సాగు చట్టవిరుద్ధమని, ఇప్పటికైనా మానుకోవాలని హితవుపలికారు. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచే ఇతర పంటలపై దృష్టి సారించాలని కోరారు.



రాయగడ : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ స్వాతి

గూడ్స్‌రైలులో అగ్ని ప్రమాదం

కొరాపుట్: కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్‌లో మాచ్‌ఖండ్ రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద నిలిపి ఉన్న గూడ్స్ బోగీల కింద మంటలు చెలరేగాయి. గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బచేలి నుంచి విశాఖకు ముడి ఇనుప రజను లోడు తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు మంటలు గుర్తించి రైల్వే సిబ్బందిని అప్రమత్తం చేశారు. నందపూర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.



రైల్వే బోగీల కింద మంటలు

రైల్వే జీఎం పర్యటన రద్దు..

ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ పంఖువాల్ పర్యటన రద్దయ్యింద. గురువారం కొరాపుట్ జిల్లాకు రావాల్సి ఉండగా ఆఖరి సమయంలో పర్యటన రద్దు చేసుకున్నారు.


యువకుడి దుర్మరణం



ప్రమాద దృశ్యం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన జిల్లాలోని మునిగుడ సమితి కొరడాబంతఘాటి వద్ద గురువారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తొలొఖెలియానాలో గ్రామానికి చెందిన బలరామ్ నుండ్రుక (32) మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. గురువారం మధ్యాహ్నం బలరాం ఇంటి నుంచిమునిగుడ వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డు పక్కన ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తినిలిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ కలసి బైక్‌పై మునిగుడ వైపు వెళ్తుండగా.. తొలొఖెలియానాలో ఘాటీ ఎక్కుతున్న సమయంలో ఎదరుగా కర్రల లోతుడో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతా బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడిపోగా బలరాం పై కర్రలు, ట్రాక్టర్ పడిపోవడంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జాతీయ సదస్సుకు ఉగ్రముప్పు



ఖలీస్థాన్ ఉగ్రవాదులు విడుదల చేసిన పోస్టర్

- ఖలిస్థాన్ ఉగ్రవాద సంస్థ బెదిరింపు
- అప్రమత్తమైన పోలీసులు

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ వేదికగా శుక్రవారం జరగనున్న పోలీసు డైరెక్టర్ జనరల్, ఇనస్పెక్టరు జనరల్ జాతీయ సదస్సుకు ఉగ్రవాద బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వంటి ప్రముఖులు హాజరుకానున్న ఈ సదస్సు ఆరంభానికి ముందుగా సిక్కు ఫర్ జస్టిస్ (ఎస్‌ఎఫ్‌జే) ఉగ్రవాద సంస్థ బెదిరింపులు దిగడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రధాన మంత్రి పాల్గొంటున్న జాతీయ సదస్సును భగ్నం చేయాలని అనుచర వర్గాలకు పిలుపునివ్వడం కలకలం రేపింది. ఖలిస్థానీ ఉగ్రవాది, సిక్కు ఫర్ జస్టిస్ (ఎస్‌ఎఫ్‌జే) ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు గురు పత్వంత్ సింగ్ పన్నూన్ బెదిరింపు ప్రసారం చేశాడు. భువనేశ్వర్‌లోని ఆలయాలు, హోటళ్లలో మారు వేషాలతో దాడికి సిద్ధం కావాలని పిలుపునిచ్చాడు.

భద్రత కట్టుదిట్టం..

ఉగ్రవాద బెదిరింపులతో డీజీ, ఐజీ సదస్సు పురస్కరించుకుని నగరంలో భద్రత కట్టుదిట్టం చేశారు. మూడు రోజుల జాతీయ సదస్సు పురస్కరించుకుని గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వై.బి.ఖురానియా తెలిపారు. పలు ప్రాంతాలను నో ఫ్లై, నో డ్రోన్ ప్రాంతాలుగా ప్రకటించామని చెప్పారు. 39 ప్లాటూన్ల పోలీసులతో అదనపు ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పీజీ), కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) మోహరించామని వివరించారు.

నగరానికి చేరుకున్న ప్రముఖులు

గురువారం నాటికి 3 రాష్ట్రాల ప్రతినిధులతో పాటు 30 మంది పైబడి అధికారులు నగరానికి చేరుకున్నారు. వీరిలో ఇంటెలిజెన్సు బ్యూరో డైరెక్టర్ తపన్ డెక్కా తదితరులు ఉన్నారు. ప్రధాన మంత్రి, హోం శాఖ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్ శుక్రవారం నగరం చేరుకోనున్నారు. అతిథులకు సౌకర్యం కల్పించేందుకు స్థానిక విమానాశ్రయంలో రెండు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం 4.15 గంటల ప్రాంతంలో నగరానికి చేరనున్నారు. ఆయన మూడు రోజులపాటు రాష్ట్రంలో బస చేస్తారు.

'ది సబర్మతి రిపోర్టు' చిత్రానికి పన్ను రాయితీ

భువనేశ్వర్: వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'ది సబర్మతి రిపోర్టు' హిందీ చలన చిత్ర ప్రదర్శనకు రాష్ట్ర వ్యాప్తంగా పన్ను రాయితీ కల్పించినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి గురువారం ప్రకటించారు. స్వప్రయోజనాల కోసం గోద్రా అగ్ని ప్రమాదంలో కరసేవకుల్ని సజీవ దహనం చేసి అశాంతిని రేపిన సంఘటన వాస్తవాలతో ఈ చిత్ర నిర్మాణం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చిత్ర ప్రదర్శనకు పన్ను రాయితీ ప్రకటించాయి. ఏక్తా కపూర్ నిర్మించిన ఈ చిత్రానికి ధీరజ్ శర్మా దర్శకత్వం వహించారు. విక్రాంత్ మాస్సే, రిధి దిగ్రా, రాశిల్ ఖన్నా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల 15న చిత్రం విడుదలై బాక్సాఫీసు హిట్‌గా నిలిచింది. 2002 ఫిబ్రవరి 27న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో దుండగులు సబర్మతి ఎక్స్‌ప్రెస్‌కు నిప్పు పెట్టిన సంఘటన వాస్తవ కథనంతో ఈ సినిమాను రూపొందించారు. అప్పట్లో అయోధ్య నుంచి తిరిగి వస్తున్న 59 మంది హిందూ భక్తుల్ని సజీవ దహనం చేశారు. దీంతో గుజరాత్‌లో అల్లర్లు చెలరేగాయి.



ది సబర్మతి రిపోర్టు సినిమా పోస్టర్

వరి పంట దగ్ధం

కొరాపుట్:

నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి సనకొయిలారి గ్రామంలో చంద్ర మజ్జికి చెందిన పొలంలో వరి కుప్పలు కాలిపోయాయి. రెండు ఎకరాల పండించిన పంట దగ్ధం కావడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. డాబుగాం, పపడాహండి అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోనికి తీసుకొచ్చారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

వైభవంగా .. కార్తీక ఆకాశ దీపారాధన

స్థానిక ఎన్‌కేటీ రోడ్డులోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి కార్తీక ఆకాశ దీపాలు వెలిగించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జి.నాగేశ్వరరావు దంపతులు, పాత్రికేయుడు ఎస్.శ్రీనివాస రావు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్తీక పూజలు చేసి ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాలను వెలిగించారు. పూజారులు ఆకాశ దీపాలను ధ్వజస్తంభం పైకి లేపారు. ఆకాశ దీపం వెలిగించిన మహిళా భక్తులు వైభవ వేంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జయపురం



అష్టోత్తర పూజలు చేస్తున్న మహిళలు



ఆలయంలో భక్తులు వెలిగించిన ఆకాశ దీపాలు

క్లుప్తంగా

కాశీబుగ్గలో దొంగల హల్‌చల్

- 10 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు మాయం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గురువారం దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసిన ఇంటిని టార్గెట్ చేస్తూ చోరీకి తెగబడ్డారు. కాశీబుగ్గ అయ్యప్పస్వామి టెంపుల్ వీధిలో పలాస విద్యుత్ లైన్‌మెన్ తుంగాన ప్రభాకర్ ఇంటి తాళాలు పట్టపగలు పగలగొట్టిన దుండగులు లోపలికి చొరబడ్డారు. బీరువా తాళాలు తెరిచి బీరువా సొరుగులోని రూ.1.50 లక్షల నగదు, 10 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. లైన్‌మెన్ ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లినట్లు బంధువులు తెలుపుతున్నారు. ఇంటి తాళాలు పగలగొట్టడాన్ని చూసి వారు షాక్ అయ్యారు. తక్షణమే స్థానికుల సహకారంతో కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ మోహనరావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. క్లూస్ టీమ్ చేరుకుని ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తూ, పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

వృద్ధురాలు మృతి

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వెనుక వీధిలో గురువారం ఓ యాచకురాలు మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదిఆంధ్ర వీధిలో నివాసముంటున్న లక్ష్మి అనే యాచకురాలు మద్యానికి బానిసై కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైంది. బుధవారం రాత్రి ఇందిరాగాంధీ జంక్షన్ వెనుక బాగంలో అయ్యప్పనగర్‌కు వెళ్లే దారిలో షాపు బయట పడుకుంది. గురువారం ఉదయం చూసేసరికి మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు బంధువులకు సమాచారం అందించారు. అనంతరం మృతిరాలి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

మత్స్యకారుడు మృతి

గార: మండలంలోని బలరాంపురం గ్రామానికి చెందిన వాసుపల్లి అప్పయ్య (58) వేటకు వెళ్లి మృతి చెందాడు. బుధవారం ఉదయం వేటకు వెళ్లి చీకటిపడుతున్నా ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం కూడా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. చివరకు గ్రామ సమీపంలోని ఉప్పుగెడ్డపై మృతదేహం తేలింది. కుమారుడు అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జనార్ధన తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లేపల్లిగూడ గిరిజన గ్రామంలో మతిస్థిమితం లేని వృద్ధుడు శివకోల రమణయ్య (94) బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈయన స్వగ్రామం సరుబుజ్జిలి మండలం కొత్తకోట. రెండు రోజుల కిందట కొత్తకోటలోని పెద్ద చెరువు మీదుగా బూర్జ మండలం వైకుంఠపురం వైపు వెళ్లాడు. అదే మండలంలోని అల్లేపల్లిగూడ కొండ దిగువున పొదల్లో పడి మృతి చెందాడు. ఇతని కుమారుడు 8 నెలల కిందట మృతి చెందాడు. కుమార్తెలకు వివాహమైంది. గ్రామంలో ఒక్కడే ఉండేవాడు. ఐదేళ్ల కిందట హిరమండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ పాడలి–దుగ్గపురం నుంచి కొత్తకోట వలస వచ్చాడు. కుమార్తె కె.ప్రమీళ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవళ్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లులో చోరీ



దొంగతనం జరిగిన గది

ఎల్.ఎన్.పేట: మండలంలోని ధనుకువాడ రోడ్డులో ఉన్న కల్కి కామాక్షి రైస్ మిల్లులో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. ఆఫీసు గది తాళాలు పగలు గొట్టి కంప్యూటర్, ఇతర పరికరాలను పట్టుకుపోయారు. మిల్లు యజమాని పూర్ణ సురేష్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సరుబుజ్జిలి ఎస్సై ఎస్.బాలరాజు తెలిపారు.

నాటుసారాతో ఒకరు అరెస్టు

సోంపేట: స్థానిక ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి 200 నాటుసారా ప్యాకెట్లుతో ఒక ముద్దాయిని అరెస్టు చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. మందస పరిధిలో బెల్లం విక్రయించే వ్యాపారులకు ముడి బెల్లంను విక్రయిస్తే చర్యలు తప్పవని నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. వివిధ కేసుల్లో అరెస్టైన 15 మంది ముద్దాయిలను మందస, కంచిలి మండల తహసీల్దార్ల సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందన్నారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా శిశు మహోత్సవం

జిల్లాలోని ఆర్.ఉదయగిరి బ్లాక్ రామగిరి ప్రభుత్వ ఎస్.ఎస్.డి. ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సర్గిపుల్లో శిశు మహోత్సవాన్ని కలెక్టర్ బిజయకుమార్‌దాస్ గురువారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మోహనా ఎమ్మెల్యే దశరథి గొమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, డీఈ మాయాధర సాహు తదితరులు పాల్గొన్నారు.

- పర్లాకిమిడి



విజ్ఞాన ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



శిశు మహోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



హాజరైన ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, జెడ్పీ అధ్యక్షుడు తిరుపతిరావు, అధికారులు

మహిళలపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న జిల్లా సామాజిక సంక్షేమ శాఖాధికారి మనోరమా దేవి

పర్లాకిమిడి: మహిళలపై అత్యాచారాలు, దాడులు అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలులో గురువారం నుంచి 16 రోజుల పాటు జరగనున్న శిక్షణా తరగతులను జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక భద్రత అధికారి సంతోష్ కుమార్ నాయక్, ఒన్ స్టాప్ సెంటర్ జ్యువెనల్ కోర్టు బోర్డు సభ్యులు భాగ్యలక్ష్మీ నాయక్, జిల్లా కల్చరల్ అధికారిని అర్చనా మంగరాజ్, ఐ.యస్.ఆర్.డి.మధుస్మితా సాహు, ఐ.ఎస్.ఆర్.డి.సభ్యులు సునితా రోథో, జిల్లా జీవనోపాధు మిషన్ డైరెక్టర్ శివాణీ పాణిగ్రాహి, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర చౌదురి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు

సౌత్‌కోస్టు ఏర్పాటుపై అనుమానాలు వద్దు



నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మఝి

కొరాపుట్: వాల్తేర్ కేంద్రంగా సౌత్ కోస్ట్ ఏర్పాటుపై అనుమానాలు వద్దని బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ప్రత్యేక వీడియో విడుదల చేశారు. సౌత్ కోస్ట్ ఏర్పాటుపై టెండర్ విడుదలైందని, దాని వల్ల ఒడిశాకు నష్టం జరుగుతుందనే ప్రచారాలు జరుగుతున్నాయని చెప్పారు. అయితే సౌత్ కోస్ట్ ఏర్పాటైతే ఒడిశాకి ఎటువంటి నష్టం జరగదన్నారు. గతంలో ఆంధ్ర ప్రదేశ్–తెలంగాణా రాష్ట్రాల విభజన జరిగినప్పుడు విశాఖపట్నం లో సౌత్ కోస్ట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగానే సౌత్ కోస్ట్‌పై టెండర్లు విడుదలయ్యాయన్నారు. ఈ విషయమై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి చర్చించామన్నారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఒడిశాకి ఎటువంటి నష్టం జరగదని వివరణ ఇచ్చారని బలబద్ర పేర్కొన్నారు. అంతేకాక రాయగడ కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు పనులు వేగవంతమయ్యాయని చెప్పారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో విద్యార్థి ప్రతిభ



ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పొరిడ నుంచి ట్రోఫీని అందుకుంటున్న పరశురాం హల్వ

జయపురం: భువనేశ్వర్ కళింగ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన ప్రారంభమైన 'మహక్–2024'సందర్భంగా నిర్వహించిన చిత్ర లేఖన పోటీలలో జయపురం ఉత్కళ బాలాశ్రమ పాఠశాల విద్యార్థి పరశురాం హల్వ ద్వితీయ స్థానం సాధించాడు. రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి విద్యార్థులు తలపడగా పరశురాం హల్వ మెరుగైన ప్రతిభ కనబర్చాడు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పొరిడ చేతుల మీదుగా పరశురాం హల్వ ప్రశంసా పత్రం, ట్రోఫీని అందుకున్నాడు. విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్, మహిళా శిశువికాస కమిషనర్ శోభా శర్మ, ఆర్థిక విభాగ స్వతంత్ర కార్యదర్శి యామిణి షాడంగిలు విద్యార్థి పరశురాం హల్వను అభినందించారు.

నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

భువనేశ్వర్: స్థానిక ప్రైవేటు నర్సింగ్ విద్యా సంస్థకు చెందిన 10 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరంతా హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ఆహారం తీసుకున్న కాసేపటికే విరేచనాలు, కడుపు నొప్పి, వాంతులు, తల నొప్పి వంటి అస్వస్థతకు గురి కావడంతో స్థానిక బీఎంసీ ఆస్పత్రిలో చేర్చి చికిత్స ప్రారంభించారు. వీరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం.

తాగునీటి ప్రాజెక్టు పనులపై సమీక్ష



పనులు పరిశీలిస్తున్న అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి మురాణ డ్యామ్ ప్రాంతంలో మేఘా తాగునీటి ప్రాజెక్టు పనులపై గురువారం జిల్లా సీడీఓ దేవాశిశ్ పట్నాయిక్, ఏడీఎం అగ్నిజిత్ రౌత్ సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు నిర్మాణ పనులు పరిశీలించారు. వారితో పాటు జయపురం సమితి బిడిఓ శక్తి మహాపాత్రో, ప్రభుత్వ ఎగ్జిక్యూట్ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, జిల్లా రూరల్ వాటర్ సప్లయ్ ఇంజినీర్ పాల్గొన్నారు.

పోలీసుల దాడులు

భువనేశ్వర్: నగరంలో సెక్స్ రాకెట్ గుట్టు రట్టయ్యింది. పక్కా సమాచారం ఆధారంగా ఖండగిరి ప్రాంతంలో అద్దె ఇంటిపై దాడి నలుగురు యువతుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఒక బైక్‌ను కూడా స్వాధీనపరచుకున్నారు.

సైబర్ నేరగాడు అరెస్టు



అబ్దుల్ సలీం

భువనేశ్వర్: రాష్ట్రంలో కోటి రూపాయల ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన నిందితుడు అబ్దుల్ సలీం (33)ను హైదరాబాద్‌లో అరెస్టు చేసినట్లు రాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు గురువారం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా ఎల్లమ్మగుట్టకు చెందిన అబ్దుల్ సలీం రాష్ట్రంలో ఓ వృద్ధుడిని డిజిటల్ లావాదేవీలతో మోసగించి రూ. కోటి కాజేయడంతో దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అరెస్టు చేశామన్నారు. ఇతని వద్ద నుంచి మొబైలు ఫోన్, 3 భారత సిమ్ కార్డులు, ఒక సౌదీ అరేబియా సిమ్ కార్డు, స్టేటు బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ పాసు పుస్తకం, పాసుపోర్టు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, 6 డెబిట్ కార్డులు, ఒక క్రెడిట్ కార్డుని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఇద్దరు మోసగాళ్లు అరెస్టు



నిందితులతో మల్కన్‌గిరి పోలీసులు

మల్కన్‌గిరి: అధికారులమని పలువురిని నమ్మించి వారి వద్ద నుంచి నగదు తస్కరించిన ఇద్దరు మోసగాళ్లను మల్కన్‌గిరి పోలీసులు బుధవారం భువనేశ్వర్‌లో అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మల్కన్‌గిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్ నయఘర్ జిల్లా సోరాడ గ్రామానికి చెందిన కార్తీక్ రౌతరోయి, ఏకాన్ మాణిలు గత ఏడాది జూలై నెలలో మల్కన్‌గిరి వచ్చారు. తాము ఎస్‌డీపీవోలుగా పని చేస్తున్నామని.. ఓ కేసులో విచారించాలని చెప్పి మల్కన్‌గిరికి చెందిన న్యాయవాదులు రాజేష్ పట్నాయక్‌తోపాటు మరొకరి వద్ద నుంచి పదేసి వేల రూపాయలను తీసుకున్నారు. అలాగే మల్కన్‌గిరి సమితి చలాన్‌గూడ పంచాయతీ సర్పంచ్ అరఖిత్ నాయక్ నుంచి రూ. 18 వేలు వసూలు చేశారు. తరువాత వీరితో మాట్లాడేందుకు న్యాయవాదులు ఎంత ప్రయత్నించినప్పటికీ ఫోన్లు పని చేయలేదు. దీంతో మోసపోయామని గమనించి మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో వద్ద పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోద్ చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు భువనేశ్వర్‌లో ఉన్నట్టు తెలుసుకున్నారు. ప్రత్యేక బృందం అక్కడకు వెళ్లి కార్తీక్ రౌతరోయి, ఏకాన్ మాణిలను మల్కన్‌గిరి బుధవారం మల్కన్‌గిరి తీసుకొని వచ్చారు. గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సుమన్ జెనా

జయపురం: స్థానిక న్యాయ కళాశాలలో గురువారం కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెనా హాజరై అత్యాచారాలు, వరకట్న వేధింపులు, గృహ హింస తదితర చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతామణి పండా, అధ్యాపకులు డాక్టర్ సుజిత్ కుమార్ బిశాయి, చక్రధర పాణి తదితరులు పాల్గొన్నారు.

డీజీ, ఐజీ సదస్సు విజయవంతం చేస్తాం

- పోలీసు కమిషనర్ దేవ దత్త సింగ్



భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా జరుగుతున్న డీజీ, ఐజీ జాతీయ సదస్సును విజయవంతం చేస్తామని కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్ దేవ దత్త సింగ్ చెప్పారు. గురువారం ఆక్షన మీడియాతో మాట్లాడారు. ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాది గురు పత్వంత్ సింగ్ పన్నూన్ నుంచి ముప్పు పొంచి ఉన్నట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. జాతి వ్యతిరేక ఉగ్రవాదశక్తులు డీజీ, ఐజీ సదస్సుకు ఎటువంటి అంతరాయం కలిగించలేని రీతిలో భద్రత, రక్షణ ఏర్పాట్లు పటిష్టపరిచినట్లు కమిషనరు పేర్కొన్నారు. ఈ సదస్సు శుక్రవారం నుంచి ఆరంభం కానుంది. మన దేశంలో అనేక జాతి వ్యతిరేకశక్తులు ఉన్నాయి. వృత్తిపరమైన సామర్థ్యం మేరకు ఈ శక్తుల నుంచి జాతీయ సదస్సుకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా చేస్తామని గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఒడిశా పోలీసు, ఉగ్రవాద నిరోధక వర్గాలు, ఇంటెలిజెన్సు బ్యూరో, కేంద్ర సాయుధ పోలీసు దళం వంటి పటిష్టమైన వ్యవస్థ మధ్య కార్యక్రమం సజావుగా కొనసాగడం తథ్యమన్నారు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు మూడు రోజుల పాటు 59వ డీజీ, ఐజీ పోలీసు జాతీయ సదస్సు జరుగుతుంది.

సదస్సు ఏర్పాట్లపై సీఎం సమీక్ష



డీజీ, ఐజీ జాతీయ సదస్సు ప్రాంగణం వద్ద ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: పోలీసు డైరెక్టరు జనరల్, ఇనస్పెక్టరు జనరల్ జాతీయ సదస్సుకు స్థానిక లోక్ సేవా భవన్ వేదిక కానుంది. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తదితర ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి గురువారం ప్రత్యక్షంగా సమీక్షించారు. రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వై.బి.ఖురానియాతో ఇతర సీనియర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కన్వెన్షన్ హాలులో ఏర్పాట్లను వివరిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



నగరంలో ప్రధాన మంత్రి కార్యేడ్

జయపురంలో అయ్యప్పస్వాముల పూజలు



అయ్యప్ప పూజలు ప్రారంభిస్తున్న బ్రహ్మాజీ



పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

జయపురం: జయపురం పట్టణంలోని మా జగత్ జననీ మందొర వీధిలో అయ్యప్పస్వాముల పడిపూజలు గురువారం వైభవంగా జరిగాయి. జయపురం విశ్వబ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ భక్తి మండలి అధ్యక్షులు పట్నాన బ్రహ్మాజీ నిర్వహించిన పూజల్లో పట్టణంలో అయ్యప్ప మాలలు వేసుకున్న భక్తులందరూ పాల్గొన్నారు. స్వాములందరికీ అల్పాహార విందును బ్రహ్మాజీ ఏర్పాటు చేశారు.



పాటలు పాడుతున్న గురుస్వామి, ఇతర భక్తులు



పూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

బధిరుల క్రికెట్ టోర్నీ విజేత ఒడిశా



విజేతగా నిలిచిన ఒడిశా జట్టు

అనంతపురం: బధిరుల అండర్–19 జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్ (ఐడీసీఏ)ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ స్టేడియంలో గురువారం డెఫ్ ఒడిశా, డెఫ్ హర్యానా మధ్య ఫైనల్ పోటీ హోరాహోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన డెఫ్ ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. జట్టులో సనితొట్టి 42 పరుగులతో రాణించాడు. అనంతరం బరిలో దిగిన డెఫ్ హర్యానా జట్టు 17.4 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. 40 పరుగుల తేడాతో ఒడిశా జట్టు గెలుపొందింది. సిరీస్ బెస్ట్ బ్యాటర్‌గా ఆర్వేటి లోకేష్ 126 పరుగులు, బెస్ట్‌బౌలర్‌గా పి. విజయ భాస్కర్ (ఏపీ – 12 వికెట్లు), మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సనితొట్టి (ఒడిశా – 116 పరుగులు, 8 వికెట్లు, రెండు క్యాచ్‌లు) నిలిచారు. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను ఐడీసీఏ సెక్రెటరీ అజయ్, స్పోర్ట్స్ అకాడమీ మేనేజర్ శ్రీదేవి, డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కె.గోపీనాథ్, సత్యనారాయణరెడ్డి, తదితరులు అందించారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆళ్ల శ్రీనివాసరావు (ఫైల్)

పాతపట్నం: స్థానిక యశోదనగర్‌కు చెందిన ఆళ్ల శ్రీనివాసరావు గురువారం సాయంత్రం అంతరాబ రోడ్డు స్టూడెంట్ కాలనీలోని ఒక ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మెళియాపుట్టి మండలం వసుంధర గ్రామానికి చెందిన ఆళ్ల శ్రీనివాసరావు(38) వ్యాపారం కోసం పాతపట్నంకు ఆరు సంవత్సరాల క్రితం వచ్చి, యశోదనగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఈయన గతంలో సెయింటెన్స్ స్కూల్ ఎదురుగా ఫర్నీచర్ దుకాణం నిర్వహించాడు. ఇటీవల కాలంలో వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులబారిన పడినట్లు కుటుంబీకులు తెలిపారు. గురువారం సాయంత్రం అంతరాబ స్టూడెంట్ కాలనీలోని ఒక ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. సంఘటన స్థలానికి సీఐ వి.రామారావు, ఎస్‌ఐ బి.లావణ్యాలు చేరుకుని మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య స్వాతి, బాబు కార్తీక్, పాప మౌనికలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

క్లుప్తంగా

ఇద్దరు అయ్యప్ప భక్తులకు తీవ్రగాయాలు

● బైక్‌ను కారు ఢీకొనడంతో ప్రమాదం


చికిత్స పొందు తున్న మహేష్


వైద్య పరీక్షల కోసం చైతన్యను వీల్‌చైర్‌పై తీసుకెళుతున్న ఆస్పత్రి సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాలాధారణ ధరించిన భక్తులు తుని వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అంపావిల్లి మహేష్, బండారు చైతన్య బుధవారం ద్విచక్ర వాహనంపై ద్వారపూడిలో అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు.రాత్రి 9.30 గంటల సమయంలో తుని వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో మహేష్‌కు తలపైన బలమైన గాయం కాగా చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు వారిని తరలించారు. మహేష్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆందోళన చెందుతూ హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు బయలుదేరి వెళ్లారు.

79 మద్యం బాటిల్స్‌తో నిందితుడి అరెస్ట్


పోలీసుల అదుపులో మద్యం తరలిస్తున్న నిందితుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ద్విచక్ర వాహనంపై మద్యం బాటిల్స్ తరలిస్తున్నారనే ఎస్పీ సమాచారంతో దాడులు నిర్వహించి.. బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి నుంచి 79 మద్యం బాటిల్స్ సీజ్ చేసి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనధికారంగా మద్యం అమ్మకాలు సాగిస్తే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ


పౌష్టికాహార రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ జిల్లా పీడీ ఎంఎన్ రాణి

సీతానగరం: జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమకూర్చుతున్న పౌష్టికాహారాన్ని నిర్దేశించిన గడువులోగా బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు పంపిణీ చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు, కేంద్రానికి సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధనను చూశారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందుతున్నదీ లేనిది ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలకేంద్రాన్ని మోడల్ కేంద్రంగా గుర్తించడం వల్ల మిగిలిన కేంద్రాలూ ఇదే తరహాలో తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఐసీడీఎస్‌కు ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలమేరకు కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆమెవెంట జిల్లా నోడల్ అధికారి ఎస్.రాజ్యలక్ష్మి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిరిజన సంస్కృతి, పరిశోధనా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈనెల 26,27 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వివిధ ఆశ్రమపాఠశాలలు, గురుకులాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వారిని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం అభినందించారు. ప్రతి రోజు పాఠశాలల్లో క్రీడలు ఆడడం ప్రాక్టీస్ చేయాలన్నారు. క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో మెరుగైన సేవలందించాలి

● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


గౌరవ వందనం స్వీకరిస్తున్న విశాఖరేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మూడురోజుల పాటు నిర్వహించనున్న వార్షిక జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2024 వేడుకలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి గురువారం ప్రారంభించారు. జిల్లా పోలీసుశాఖకు చెందిన విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి చెందిన నాలుగు జట్లు వివిధ స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ మీట్‌లో పోటీపడి తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగులు అన్నిరంగాల్లోనూ ఇతరులకు రోల్ మోడల్‌గా ఉండాలని సూచించారు. ఉద్యోగరీత్యా పోలీసులు అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న కారణంగా శిక్షణలో ఉన్న శారీరక సామర్థ్యాన్ని కొనసాగించడం కష్టంగా మారుతుందన్నారు. కానీ, శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ఆనందం కూడా చాలా అవసరమని, వాటిని మెరుగుపర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పోలీసుల ఆరోగ్యం, మానసిక ఆనందాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసు ఉద్యోగులకు ఎన్ని అత్యవసర విధులున్నప్పటికీ వార్షిక క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. ఈ క్రీడలు ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పరచడానికి, కుటుంబ పరిస్థితులను ఒకరితో ఒకరు చెప్పుకోవడంతో పాటు, సమాజంలో కొత్తగా జరుగుతున్న నేరాలను నియంత్రించడానికి అవలంబించాల్సిన విధివిధానాలను, ఆలోచనలను పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి గెలుపోటముల మధ్య చిన్న వ్యత్యాసం మాత్రమే ఉంటుందని, దాన్ని అధిగమించి, విజయం సాధించేందుకు అవసరమైన స్ఫూర్తిని ఈ క్రీడలతో ఉద్యోగులు పొందాలని, సమాజానికి మరింత మెరుగైన సేవలనందించాలని పిలుపునిచ్చారు.

క్రీడాస్ఫూర్తి అవసరం

ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, ఉద్యోగులందరూ ఒక్కటిగా పనిచేయడం, విజయానికి అవసరమైన సహాయ, సహకారాలను ఒకరికొకరు అందించుకునే క్రీడాస్ఫూర్తి ఉద్యోగుల్లో అవసరమన్నారు. శారీరక, మానసిక సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడానికి కనీసం ఏదో ఒక క్రీడలో ప్రతిరోజూ పాల్గొనాలని సూచించారు. 31వ వార్షిక క్రీడలను విశాఖ రేంజ్ డీఐజీ గాల్లోకి బెలూన్లు, కపోతాలను ఎగురవేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తొలుత పురుషుల 400 మీటర్లు, మహిళల 100 మీటర్ల పరుగు పందెం ప్రారంభించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. ప్రారంభ వేడుకల్లో వివిధ పోలీసు జట్లు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకుంది. క్రీడాపోటీల ప్రారంభ వేడుకలకు వి.శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పోటీలో పరుగు తీస్తున్న పోలీసులు


గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్న విశాఖరేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ వకుల్ జిందాల్

పరికరాల కోసం ప్రత్యేక శిబిరాలు

● సద్వినియోగం చేసుకోవాలి
● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


హాజరైన వయోవృద్ధులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలిమ్ కో సంస్థ సౌజన్యంతో పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన దివ్యాంగులు, వయోవృద్ధులతో కలెక్టర్ మమేకమయ్యారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో ఎంపికైన వారికి పత్రాలను పంపిణీ చేశారు. నెల, రెండు నెలల్లో పరికరాలు వస్తాయని వాటిని అప్పుడు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ వారి వైకల్యాన్ని గుర్తించి వారి రోజువారీ సాధారణ జీవితం సాఫీగా కొనసాగించేందుకు సహాయక సామగ్రిని అందజేస్తోందని చెప్పారు. ఈ మేరకు భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన హైదరాబాద్ ఆధారిత అలిమ్ కో-కంపెనీ సహకారంతో ఈ నెల 26న సాలూరులో, 27న పాలకొండలో గురువారం పార్వతీపురంలో శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. శుక్రవారం కురుపాంలో దివ్యాంగ అభ్యర్థులను పరీక్షించి, వారి వైకల్యానికి అవసరయ్యే పరికరానికి ఎంపిక చేసి వారికి ఉచితంగా సరఫరా చేయనున్నామని కలెక్టర్ తెలిపారు. బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్, సాధారణ ట్రైసైకిల్స్, వీల్‌చైర్, చంక కర్రలు, కాలిపర్స్, కృత్రిమ భాగాలు, స్మార్ట్ కేన్, బ్రెయిలీ కిట్, స్మార్ట్ ఫోన్, వినికిడి సాధనాలతో సహా వివిధ పరికరాలు అందించనున్నట్లు వివరించారు.

గుర్తింపు శిబిరాలకు మంచి స్పందన

గుర్తింపు శిబిరాలకు లబ్ధిదారుల నుంచి మంచి స్పందన లభించింది. సాలూరులో 82 మంది అభ్యర్థులు ఎంపికవగా వారికి సుమారు రూ.17.18 లక్షల విలువగల పరికరాలు అందనున్నాయన్నారు. పాలకొండలో 75 మంది ఎంపిక కాగా రూ.11.87 లక్షల విలువ గల పరికరాలు అందనున్నాయి. పార్వతీపురంలో నిర్వహించిన శిబిరానికి 250 లబ్ధిదారులు హాజరయ్యారన్నారు. కురుపాంలో మంచి స్పందన రాగలదని ఆశిస్తున్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె కవిత, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రమేష్ రామన్, అలిమ్ కో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసుల పర్యవేక్షణకు జిల్లా లీగల్ సెల్ ఏర్పాటు

● నోడల్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ
● కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: హైకోర్టు, జిల్లా కోర్టులలో ఫైల్ అయిన కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి, కంటెంప్ట్‌లు పడకుండా అవసరమైన కౌంటర్లను వేయడానికి జిల్లా స్థాయి లీగల్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. ఈ లీగల్ సెల్‌కు డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణను నోడల్ అధికారిగా నియమిస్తూ సహాయకులుగా డిప్యూటీ తహసీల్దార్లను ఎం.ఉమ, సీహెచ్.రాజేశ్వరి, జూనియర్ అసిస్టెంట్‌మె.శివసాయికిరణ్‌లను, లైజన్ అధికారిగా టి.రామకృష్ణ, సూరింటెండెంట్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ గురువారం తన చాంబర్‌లో లీగల్ సెల్ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలను జారీ చేశారు. ప్రతి శనివారం జిల్లా మొత్తం కేసుల వివరాలను తనకు సమర్పించాలని, సోమవారం పీజీఆర్ఎస్‌లో హెచ్ఓడీలతో కేసులపై సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్

ఉద్యోగులను రెగ్యులర్‌గా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ

పార్వతీపురంటౌన్: ఐటీడీఏ పరిధిలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్‌సోరి్సంగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో గురువారం ఆయన పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ఐటీడీఏ పరిధిలోని గురుకుల పాఠశాలల్లో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనాలు చెల్లించకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. భవిష్యత్తులో తమ ఉద్యోగం రెగ్యులర్ అవుతుందనే ఆశతో పని చేస్తున్న వారి పట్ల ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైన విధానం కాదన్నారు. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో మెగా డీఎస్సీలో ప్రస్తుతం వీరు పనిచేస్తున్న స్థానాలను వీరికే రిజర్వ్ చేసి మిగిలిన ఖాళీలను మాత్రమే డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు యూనియన్ నాయకులు దివాకర్, రమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో నైపుణ్య శిక్షణకు అవగాహన ఒప్పందం


అవగాహన ఒప్పంద పత్రాలతో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) విశ్వవిద్యాలయంతో దర్పణ్ నీతిఆయోగ్ గుర్తింపు పొందిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) సంస్థ గురువారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, సీఎస్‌సీ సంస్థ సలహాదారు వై.రామ్మోహన్ రావు అవగాన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజేనాగరాజు, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఎ.పద్మజ, డాక్టర్ ఎం.హేమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో వెనుకబాటు

● 2024-25లో 2.20 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం
● నవంబర్ 27 నాటికి1.40 కోట్ల పనిదినాలు పూర్తి
● మిగిలినవి 79 లక్షల పనిదినాలు


గంట్యాడ మండలంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

2024-25 సంవత్సరంలో మండలాల వారీగా కల్పించిన పనిదినాలు

మండలం	లక్ష్యం	కల్పించింది	కల్పించాల్సింది
బాడంగి	7,59,053	4,27,785	3,32,168
భోగాపురం	7,83,229	4,40,043	3,43,186
బొండపల్లి	7,81,974	4,64072	3,18,902
చీపురుపల్లి	8,60,516	5,43,552	3,16,964
దత్తిరాజేరు	7,84,194	4,45,879	3,38,315
జామి	7,58,006	4,41,710	3,16,296
కొత్తవలస	6,92,957	3,78,207	3,14,750
మెంటాడ	7,75,660	4,44,269	3,31,391
మెరకముడిదాం	9,74,674	6,53,587	3,21,087
పూసపాటిరేగ	8,27,097	4,34,531	3,92,566
రాజాం	7,33,002	4,02,213	3,30,789
రామభద్రపురం	7,82,350	4,33,801	3,48,549
సంతకవిటి	8,63,213	5,73,458	2,89,755
వంగర	7,50,758	3,30872	4,19,888

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు ప్రవేశపెట్టారు. పథకం రాకముందు గ్రామీణ ప్రాంత ప్రజలు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు పనుల కోసం వెళ్లేవారు. ఇటువంటి వారికి సొంత గ్రామాల్లో పనులు కల్పించడం కోసం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టారు. అయితే ఈ ఏడాది ఉపాధిహామీ వేతనదారులకు పని కల్పించడంలో అధికారులు వెనుకబడ్డారు. దీంతో వేతనదారులు అందరికీ పని దొరకడం లేదు. ముఖ్యంగా కొన్ని మండలాల్లో వేతనదారులకు ప్రస్తుతం పనికల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జాబ్‌కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో లక్షల్లో వేతనదారులు ఉన్నారు. వారంతా ఉపాధి హామీ పనులకు వెళ్తారు. జిల్లాలో 3.45 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. వాటిలో 6,11,286మంది వేతనదారులు ఉన్నారు.

లక్ష్యం 2.20 కోట్ల పనిదినాలు

జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి వేతనదారులకు 2.70 కోట్ల పనిదినాలు కల్పించాలి. నవంబర్ 27 వతేదీ నాటికి 1.40 కోట్ల పనిదినాలు కల్పించారు. ఇంకా 79.65 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉంది. బాడంగి, భోగాపురం, బొండపల్లి, చీపురుపల్లి, దత్తిరాజేరు. గజపతినగరం, కొత్తవలస, మెంటాడ, పూసపాటిరేగ, రాజాం, సంతకవిటి, వంగర తదితర మండలాల్లో పని కల్పనలో వెనుకబడినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు

ఉపాధిహామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, కుంటలు, చెరువుల ఆధునికీకరణ, పొలాల చుట్టూ సరిహద్దు అంతర్గతంగా కందకాలు, పంటకుంటలు, ఊట కుంటల వంటి పనులు చేపడతారు. అదేవిధంగా పండ్ల తోటల పెంపకానికి సంబంధించి గుంతలు తవ్వడం వంటివి వేతనదారులు చేపడతారు.

కొన్ని మండలాల్లో తక్కువ పనిదినాలు

కొన్ని మండలాల్లో ఉపాధి హామీ పనిదినాల కల్పన తక్కువగా ఉంది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాం. గ్రామంలో 50 మందితో నైనా పనులు ప్రారంభించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. లక్ష్య సాధనకు ఇంకా సమయం ఉన్నందున శతశాతం లక్ష్యాన్ని సాధించడానికి చర్యలు తీసుకుంటాం.

కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌చార్జి పీడీ, డ్వామా

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన బొంత విశాలక్షి (86) విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ వి.ఎన్.మూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన విశాలక్ష్మి బుధవారం గ్యాస్ స్టవ్‌పై టిఫిన్ తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని మంటలు వ్యాప్తి చెందడంతో కుమారుడు రామజోగి సత్యనారాయణ దుప్పటి కప్పి మంటలను ఆర్పివేశాడు. దీంతో శరీరానికి అయిన గాయాలకు చికిత్స నిమిత్తం ఎస్‌కోటలో ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6గంటలకు చనిపోవడంతో మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌కోట హెచ్‌సీ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో మహిళ..

మండలంలోని వెంకటరమణ పేట గ్రామానికి చెందిన మైచర్ల సన్నమ్మ (78) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఇందుకు సంబంధించి ఎస్.కోట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సన్నమ్మ ఈ నెల 27 తన చెల్లి ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సీసీ రోడ్డుపై పడిపోయింది. దీంతో ముక్కు, నోటి నుంచి రక్త స్రావం కావడంతో ఎస్‌కోట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరంలోని ఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం చనిపోయినట్లు మృతురాలి కుమారుడు ఈశ్వర్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఏఎస్సై ఎల్.గోవిందరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీఎస్.మూర్తి తెలిపారు.

గోనె సంచుల సరఫరా

విజయనగరం ఫోర్ట్: ధాన్యం సేకరణకు గోనె సంచులు లేక రైతులు ఇబ్బంది పడు తున్న అంశంపై 'ధాన్యం సేకరణకు గోనె సంచులు కరువు' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనానికి సివిల్ సప్‌లై పీఏసీఎస్ అధికారులు స్పందించారు. రైతు భరోసా కేంద్రాల (రైతు సేవా కేంద్రాలు)కు ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు సరఫరా చేశారు.

ఆదుకుంటున్న కొడుకు అనంతలోకాలకు..

● ఉపాధి కోసం వెళ్తే ఆగిపోయిన ఊపిరి
● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
● ఒంటరిగా మిగిలిన తల్లి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

వీరఘట్టం: అమ్మా పని ముగించుకుని సాయంత్రం వేగంగా వచ్చేస్తానని చెప్పిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడనే విషయం తెలియడంతో ఆ తల్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.వీరఘట్టం మండలం జె.గోపాలపురం గ్రామానికి చెందిన ఊయక చంద్రశేఖర్(25) గురువారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బచ్చల కురిమినాయుడుతో కలిసి ఆమదాలవలస సమీపంలో జలజీవన్ మిషన్ పనుల్లో బాగంగా పైప్‌లైన్లు వేసే పని కోసం గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బైక్‌పై చంద్రశేఖర్ బయల్దేరి వెళ్లాడు. కురిమినాయుడు బైక్ నడుపుతుండగా చంద్రశేఖర్ వెనుక కూర్చున్నాడు. ఇంతలో మార్గమధ్యంలో ఆమదాలవలస సమీపంలోని పార్వతీసురిని పేట, సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వారిద్దరూ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో బస్సు వెనుక చక్రం చంద్రశేఖర్ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కురిమినాయుడికి నడుము, మోచేయి, మోకాళ్లపై తీవ్ర గాయాలు కాగా ప్రసుత్తం ఆయన శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు చంద్రశేఖర్ తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి అమరావతి పెంచి పెద్ద చేయగా నేడు ఆ ఇంటికి చంద్రశేఖర్ పెద్దదిక్కుగా ఉన్నాడు.చంద్రశేఖర్ మృతితో ఆ తల్లి దిక్కులేనిదైపోయి రోడ్డున పడింది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విభిన్న ప్రతిభావంతుల

హక్కులను పరిరక్షించాలి

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్, కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల హక్కులను పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం-2016 అమలుపై కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ జగదీష్ చట్టంలో పొందుపర్చిన అంశాలను వివరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్ విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రస్తావించారు. సదరం ధ్రువపత్రాల జారీతో పాటు ఆటిజంతో బాధపడుతున్న వారికి బీమా కల్పించాలని కోరారు. అంధ ఉద్యోగులకు కొన్ని శాఖల్లో ఉన్నతాధికారులనుంచి వేధింపులు ఎదురవుతున్నాయని, వాటిని అరికట్టాలని, వారు చేయగలిగే పనులను మాత్రమే చెప్పాలని ఆ సంఘ నాయకుడు ఉమాశంకర్ కోరారు. సదరం ధ్రువపత్రాల్లో తప్పులు సరిచేయాలని, డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాలని, అందరికీ బస్‌పాస్‌లు మంజూరు చేయాలని, అనువాదకుడిని నియమించాలని మూగ, చెవిటి అసోసియేషన్ నాయకురాలు లక్ష్మి విజ్ఞప్తిచేశారు. సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ కార్యదర్శి టి.వి.రాజేష్‌కుమార్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలకు మంచాలు, పరుపులు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో విభిన్న ప్రతిభావంతుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డీఈఓ యు.మాణిక్యం నాయుడు, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ రాణి, డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, ఎల్‌డీఎం మూర్తి, మెప్మా పీడీ జి.వి.చిట్టిరాజు, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, డీఎస్పీ వీరకుమార్, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.